# చిలుక జోస్యం



సుబ్బారావు జీవితం వడ్డించిన విస్తరి లాంటిది.

అనుభవించడానికి అన్నీ వున్నాయి. అందమైన భార్య, హోదాగల ఉద్యోగం, చేతినిండా డబ్బు... ఇంకా ఎన్నెన్నో !

ఎంతవాడికైనా ఏదో ఒక లోటు తప్పదన్నట్లు- అన్నీ ఉన్న సుబ్బారావుకు పిల్లలు లేక పోవడమొక్కటే పెద్ద లోటయింది. ఎన్ని నోములు నోచినా, వ్రతాలు చేసినా, యాత్రలకు వెళ్లినా.., తానూ, తన భార్య ఎన్ని మందులు తిన్నా, ఎన్నో పరీక్షలు చేయించుకున్నా ఫలితం లేకపోయింది. అంతటితో అతనికున్న లోటు ఎవరూ తీర్చలేనిదైపోయింది.

సుబ్బారావుకి అత్యంత ఆప్తమిత్రుడు ప్రకాష్.

అతనికి సుబ్బారావు ఆఫీసులోనే పని. పైగా- ఒకే సెక్షన్ కూడాను. సుబ్బారావు ప్రకాష్‌కి చెప్పని, చెప్పలేని విషయమంటూ ఉండేదికాదు. చివరికి భార్య దగ్గర చెప్పలేని రహస్యాలు కూడా ప్రకాష్‌కి చెప్పేవాడు. ప్రకాష్ కూడా సుబ్బారావు ఇంట్లోని మనిషిలాగే అతని భార్య దగ్గరకూడా చనువుగా ఉంటుండేవాడు.

ఆరోజు ఆఫీసులో ఎవరి పని వారు చేసుకుంటున్నారు.

మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటింది. ఒక మంత్రి ఉన్నట్లుండి 'హరీ...' అనడంతో ఆఫీసుకు సెలవు ప్రకటించారు. మధ్యాహ్నం ఇంటికి పోయి చేసేదేముందని, హోటలుకి పోయి కాఫ్యాదులు ముగించుకుని సుబ్బారావు, ప్రకాష్ మ్యాట్నీ షోకి పోదామని ప్రోగ్రాం పెట్టుకున్నారు.

సుబ్బారావు, ప్రకాష్ బస్‌స్టాప్ దగ్గర చెట్టుకింద నిలబడ్డారు.

మధ్యాహ్న వేళేమో... బస్‌లు ఎప్పుడో కాని రావడం లేదు. వారికి దగ్గర్లోనే పంజరంలో చిలుకని పెట్టుకొని ఒక జ్యోతిషుడు కూర్చున్నాడు.

ఒక వ్యక్తి అతని దగ్గరికి వచ్చి "అన్నా... మొన్న నీ చిలక చెప్పింది జరిగింది. ఈరోజు మరో ప్రశ్న అడగాలని వచ్చాను" అన్నాడు.

"మరి.., నా చిలకజోస్యం అంటే యాటనుకున్నావ్?" అన్నాడు ఆ జ్యోతిషుడు సగర్వంగా.

జ్యోతిషుడి చేతిలో పావలా పెట్టి, ప్రశ్నను తలచుకుని చిలుక ముందు తాటాకులు ఉంచాడు ఆ వ్యక్తి. చిలుక ముక్కుతో తీసిన తాటాకును చదివి తలాడిస్తూ వెళ్లిపోయాడు.

అది చూసి, "మనం కూడా ప్రశ్న అడుగుదామేరా? కాస్త కాలక్షేపం అవుతుంది" అంటూ ముందుకి అడుగువేశాడు సుబ్బారావు.

మౌనంగా అనుసరించాడు ప్రకాష్.

పావలా తీసి ఆ జ్యోతిషుని చేతిలో పెట్టాడు సుబ్బారావు.

"దొరా... నీ మనస్సులో ప్రశ్నని తలచుకుని తాటాకులు చిలక ముందు పెట్టు" అన్నాడు ఆ జ్యోతిష్కుడు.

అలాగే చేశాడు సుబ్బారావు.

చిలక తీసిన తాటాకులో "దిగులు పడవలదు. నీ మనసులోని కోరిక, నీ ప్రియ స్నేహితుని ద్వారా తీరుతుంది" అని రాసివుంది.

అది చదవగానే గుండె ఝల్లుమంది సుబ్బారావుకి.

ప్రకాష్ ముఖం వంక అనుమానంగా చూసి, ఆ తాటాకును మిగిలిన ఆకుల్లో కలిపివేస్తూ... "పదరా- ఏ ప్రశ్న అడగాలో తోచడం లేదు. అయినా... ఈ జోస్యాల్లో నాకేం నమ్మకం లేదు" అంటూ చిర్రున లేచాడు సుబ్బారావు.

ప్రకాష్ ముఖంలో ప్రశ్నార్థకం చోటుచేసుకుంది.

- తెలుగు వార పత్రిక... *11* ఫిబ్రవరి *' 83*



**రూలంటే రూలే..!**

ఒక రైల్వేస్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్ దగ్గర చాంతాడంత క్యూలో జనం ఉన్నారు. క్యూ నత్త నడకన సాగుతోంది. గంటన్నర గడిచినా గతీ, మోక్షం లేకపోయేసరికి వెనుకనున్న ఒక వ్యక్తి సహనం కోల్పోయి కౌంటర్ దగ్గరికి వచ్చి "నువ్వు రిజర్వేషన్ లెడ్జర్ రాస్తున్నావా? లేక రైల్వే బడ్జెట్ స్పీచ్ రాస్తున్నావా?" అని అరిచాడు.

కౌంటర్ వెనుకనున్న గుమాస్తా తలెత్తకుండానే శాంతంగా "ఎంక్వయిరీలు 24 వ కౌంటర్ దగ్గర ప్లీజ్..!" అన్నాడు.



**అసలు సంగతి**

కొత్తగా సైన్యంలో చేరిన రిక్రూట్స్ సాధకబాధకాలు విచారించడానికి ఒక జనరల్ వెళ్లాడు. రిక్రూట్స్‌తో కాసేపు మాట్లాడాక- "ఇక్కడ మెస్‌లో భోజనం ఎలా ఉంటోంది?" అని అడిగాడు.

"దానికోసం మేం ఎప్పుడూ కొట్లాడుకుంటుంటాం" అన్నాడతను.

"ఆహా.. అంత బాగుంటుందన్న మాట!" అన్నాడు జనరల్ సంతోషంతో.

"అదికాదు. కొట్లాటలో ఓడిపోయిన వారు ఆ అన్నం తినాలి" అన్నాడు ఆ అబ్బాయి.